SCAN ME

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 25 | ఆదివారం, 14 జూన్, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 25 | SUNDAY, JUNE 14, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

• విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ



2



తదుపరి ఆర్మీచీఫ్‌గా

# జనరల్ ధీరజ్ సేథ్

కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ, జూన్ 13:** ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గాబాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ను తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయబోతున్నారు. ధీరజ్ సేథ్ జూన్ 30 మధ్యాహ్నం నుంచి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమి, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు. ధీరజ్ సేథ్ దక్షిణ కమాండ్, దక్షిణ పశ్చిమ మిగతా 2లో..



## రాష్ట్రవ్యాప్తంగా

# జోరు వాన

• రంగారెడ్డి జిల్లా కేశంపేటలో అత్యధికంగా 9.7 సెం.మీ • సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో 9.1 సెం.మీ వర్షపాతం • హైదరాబాద్‌లో ఇంటిపై తాటి చెట్టు పడి వృద్ధురాలి మృతి • సంగారెడ్డిలో అసిస్టెంట్ లైన్‌మన్‌కు విద్యుత్ షాక్.. దుర్మరణం • అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ ఆదేశం • నేడు, రేపు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు: వాతావరణ కేంద్రం

**హైదరాబాద్, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జోరు వాన కురిసింది. 30 జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 621 మండలాలు ఉండగా.. 435 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఖమ్మం, కొత్తగూడెం, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, హైదరాబాద్ జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. రంగారెడ్డి జిల్లా కేశంపేటలో అత్యధికంగా 9.7 సెంటీమీటర్లు, సిరిసిల్ల జిల్లా గంభీ రావుపేటలో 9.1, నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునూతలలో 8.5, వనపర్తి జిల్లాజానంపేటలో 7.7, జగిత్యాల జిల్లా వెల్గటూరులో 7.9,మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో 7.8, రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 7.7 నాగర్ కర్నూల్ జిల్లా కొడైర్, వికారాబాద్ జిల్లా బొమ్మరసపేటలో 7.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వర్షాలు దంచి కొట్టాయి. షాబాద్ మండలం తాళ్లపల్లిలో 9, రాజేంద్రనగర్‌లో 8, వికారాబాద్ జిల్లా బొమ్మరాశిపేటలో 7 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. శంషాబాద్‌లో జాతీయ రహదారిపై వర్షపునీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తక్కువ విజిబిలిటీ కారణంగా రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రావాల్సిన విమానాలను దారి మళ్లించారు. హైదరాబాద్‌లో ప్రధాన మిగతా 2లో..



# కుప్పకూలిన వాయుసేన విమానం

• అస్సాంలోని జోర్హాట్‌లో ప్రమాదం • ఐదుగురు ఎయిర్ ఫోర్స్ సిబ్బంది మృతి

**న్యూఢిల్లీ, జూన్ 13:** అస్సాంలోని జోర్హాట్‌లో ఉన్న వైమానిక స్థావరంలో ల్యాండ్ అవుతున్న సమయంలో వాయుసేనకు చెందిన ఏఎన్-32 రవాణా విమానం శనివారం ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ఐదుగురు సిబ్బంది మృత్యువాత పడ్డారు. వీరిలో ఇద్దరు అధికారులు కూడా ఉన్నారు. తీవ్రంగా గాయపడ్డ కో-పైలెట్‌కు స్థానిక మిలిటరీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమయంలో ఈ విమానంలో ఆరుగురు సిబ్బంది ఉన్నట్లు అధికారులు చెప్పారు. జోర్హాట్‌లోని రౌరీ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దైనందిన విధుల్లో ఉన్నప్పుడు ఉదయం 10 గంటల సమయంలో ప్రమాదం సంభవించిందని భారత వాయుసేన తెలిపింది. చనిపోయిన వారిలో స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభం కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్ (వాయు) ఖేమారామ్ కుమావత్, అగ్నివీర్ (వా యు) దానిష్ ఆలం ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలను కనుగొనేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. విమానం రన్‌వేపై దిగుతున్న సమయంలో నియంత్రణ కోల్పోయి రన్‌వే నుంచి పక్కకి జారిపోయిందని అక్కడి సిబ్బంది చెప్పారు. టాక్సీవే మీదుగా దూసుకెళ్లి రెండు ముక్కలైందని, తర్వాత మంటలు చెలరేగాయని తెలిపారు. అయితే విమాన ప్రమాదంలో భిన్నవాదనలు వినిపిస్తున్నాయని ది వీక్ పత్రిక తన కథనంలో పేర్కొంది. టాక్సీయింగ్ చేస్తున్న సమయంలో శక్తివంతమైన పేలుడు సంభవించిందని, ల్యాండింగ్ సమయంలో పల్టీకొట్టిందని అక్కడి వర్గాలు చెప్పినట్లు మిగతా 2లో..



## మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు

• షబ్బీర్ అలీకి ఏఐసిసి షోకాజ్ నోటీస్

2 లో..

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

• 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు

2 లో..

# ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు

• ప్రణాళికాబద్ధంగా 'ఎకో సిస్టం' అభివృద్ధి': మంత్రి శ్రీధర్ బాబు • యశోద ఆస్పత్రిలో ఏఐ ఇన్ హెల్త్ కేర్ 2.0 అంతర్జాతీయ వైద్య విజ్ఞాన సదస్సు

**హైదరాబాద్, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

"కృత్రిమ మేధ (ఏఐ) ఏదో ఒక రంగానికే మాత్రమే పరిమితం కాలేదు. అన్నింటిలోనూ విస్తరించి మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కేవలం వ్యాధి నిర్ధారణ దశకే పరిమితం కాకుండా.. రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్యరంగాన్ని చేర్చింది. ప్రతి రోగికి ప్రత్యేక వ్యక్తిగత వైద్య సంరక్షణను అందించే సాధనంగా మారింది. అయినప్పటికీ ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాలేదు. సాంకేతికతకు మానవీయ విలువల్ని జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుంది" అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలోని తన బ్రాంచిలో నిర్వహించిన 'ఏఐ ఇన్ హెల్త్ కేర్ 2.0 అంతర్జాతీయ వైద్య విజ్ఞాన సదస్సు'ను శనివారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా, ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఎకో సిస్టం'ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. హెల్త్‌కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలపాలన్నదే తమ మిగతా 2లో..



## బాచుపల్లిలో ఆ భూమికి

# మినహాయింపు

• నిషేధిత జాబితా నుంచి 3.09 ఎకరాలను తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులు

**హైదరాబాద్, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

మేడ్చల్-మలాజిగిరి జిల్లా బాచుపల్లి సర్వే నంబర్ 83లోని భూములకు సంబంధించిన సంక్లిష్ట వివాదంలో 3 ఎకరాల 9 గుంటల భూమి యజమానికి హైకోర్టు ఉపశమనం కల్పించింది. ఆ సర్వే నంబర్‌లో 3 ఎకరాల 9 గుంటల భూమిని కలిగి ఉన్న ఆ యజమాని అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్నది. భూ గరిష్ఠ పరిమితి (ల్యాండ్ సీలింగ్) కేసులో వివాదాస్పద భూముల లావాదేవీలపై ఆంక్షలు విధిస్తూ నిరుడు ఏప్రిల్ 10న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వుల పరిధి నుంచి ఆ 3 ఎకరాల 9 గుంటల భూమిని మినహాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది.



వివరాల్లోకి వెళ్తే.. బాచుపల్లి సర్వే నంబర్ 83లో మొత్తం 17.30 ఎకరాల భూమి ఉన్నది. దీని అసలు యజమాని జాగీర్దార్ జుల్ఫికర్ అలీ. 1966లో ఆయన రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా ఆ మొత్తం భూమిని ముగ్గురికి విక్రయించారు. కొనుగోలుదారుల్లో ఒకరైన వెంకట్రామయ్య ఆ ప్రాంతంలో దాదాపు 116 ఎకరాల పట్టా భూమిపై తనకు యాజమాన్య హక్కులున్నట్టు ప్రకటించడంతో వ్యవసాయ భూ గరిష్ఠ పరిమితి సంసరణల అములు తర్వాత వివాదం తలెత్తింది. దీనిపై జరిగిన విచారణలో అధికారులు దాదాపు 27 ఎకరాలను మిగులు భూమిగా నిర్ధారించారు. అందులో 5.25 ఎకరాలు సర్వే నంబర్ 83 పరిధిలోకి వచ్చాయి. 1976లో ప్రభుత్వం ఆ మిగులు భూమిని స్వాధీనం చేసుకున్నప్పటికీ సీలింగ్ ప్రక్రియకు సంబంధించిన న్యాయపోరాటం వివిధ కోర్టులు, అప్పిలేట్ వేదికల్లో దశాబ్దాలపాటు కొనసాగింది. 1970 మార్చి 30న రాసుకున్నట్టు చెప్తున్న సాధారణ, రిజిస్టర్ కాని పత్రం ఆధారంగా సర్వే నంబర్ 83లోని 6.25 ఎకరాలపై తనకు హకులున్నాయని ఎంఏ ఖయ్యూమ్ అనే వ్యక్తి పేరొన్నారు. ఆ తర్వాత 1989, 1992లో సెక్షన్లు 13బీ, 13సీ కింద ధ్రువీకరణ పత్రాలు జారీ అయినట్టు చూపే రికార్డులను సృష్టించినట్లు మిగతా 2లో..



## శత్రు దేశాల బాలిస్టిక్ క్షిపణులకు..

# 5 వేల కి.మీ. దూరంలోనే చెక్

బీఎండీ ఫేజ్-2 వ్యవస్థను విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో

2 లో..

## బొగ్గు మాయంపై

# విచారణ జరపండి

• సింగరేణిలో నిజానిజాల నిగ్గు తేల్చండి
• లేకుంటే సంస్థ ప్రయోజనాలకు విఘాతం
• సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్/న్యూఢిల్లీ, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైన ఘటనపై తక్షణమే విచారణ జరిపించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. సింగరేణిలో అవకతవకలు జరిగాయంటూ మీడియాలో వచ్చిన కథనాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోకపోతే సంస్థ ప్రయోజనాలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు ఆయన శనివారం ఒక లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.51,500 కోట్లకు పైగా బకాయిల కారణంగా ఆర్థికంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో, ఇటువంటి వార్తలు సింగరేణి ఆర్థిక స్థిరత్వాన్ని మరింతగా దెబ్బ తీసే ప్రమాదం ఉందని అన్నారు. అందుకే దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమర్థ నిర్వహణ కోసం తగిన సేఫ్ గార్డ్స్, మెకానిజం, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ సరిగ్గా అమలవుతోందా అనే అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమీక్షలో టెక్నాలజీ బెస్ట్ మానిటరింగ్ టూల్స్ వినియోగించడంపై చర్చించాలని కోరారు. సమయానుగుణంగా సమీక్షలను నిర్వహించడం ద్వారా లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి, పరిష్కరించేందుకు వీలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆర్థికవ్యవస్థలో సింగరేణి పాత్ర కీలకమని, ఈ సంస్థ ద్వారా 40వేల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని ఆయన చెప్పారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆ లేఖలో కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.





## ఆలయాల అభివృద్ధికి

# పెద్దపీట

2 లో..

• గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం • మంత్రులతో కలసి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క • సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ • 335 మంది డిపెండెంట్ కార్మికులకు నియామక పత్రాలు
• కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : భట్టి

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం 14 జూన్, 2026
సంపుటి: 2 | సంచిక: 25
Follow:

## కుప్పకూలిన వాయుసేన విమానం

(మొదటి పేజీ తరువాయి)

తన కథనంలో పేర్కొంది. రష్యా డిజైన్ చేసిన రెండు ఇంజిన్ల టర్బోప్రాప్ ఏన్టనోవ్ (ఏఎన్)32 రవాణా విమానాలు దశాబ్దాలు తరబడి సేవలందిస్తున్నాయి. సంక్లిష్టమైన భౌగోళిక ప్రాంతాలకు సిబ్బందిని తీసుకెళ్లడానికి, కీలకమైన సామగ్రిని మోసుకెళ్లడానికి ఈ విమానాలను వినియోగిస్తున్నారు. వీటిని పలుమార్లు అప్‌గ్రేడ్ చేశారు. కాగా, పాతపడిన వీటి స్థానంలో మధ్యస్థాయి రవాణా విమానాల(ఎంటీఏ) కొనుగోలుకు 2022లో సమాచార అభ్యర్థన(ఆర్ఎఫ్ఐ) జారీ చేసింది.

## బాచుపల్లిలో ఆ భూమికి మినహాయింపు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలున్నాయి. కానీ, అప్పటికే 83 సర్వే నంబర్‌లోని భూ ములన్నీ రిజిస్టర్డ్ అమ్మకపు పత్రాల ద్వారా హకులు పొందిన కొనుగోలుదారుల పేరిట నమోదై ఉండటంతో రెవెన్యూ రికార్డుల్లో ఖయ్యూమ్ పేరును చేర్చడం సాధ్యం కాలే దు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు కొన్ని రికార్డుల నుంచి వెంకట్రామయ్య పేరును తొలగించి, ఖయ్యూమ్ పేరును నమోదు చేసినట్టు ఆరోపణలు రావడంతో ఈ వివాదం మరింత సంక్లిష్టమైంది. ఆ తర్వాత ఆ భూమి పలుమార్లు చేతులు మారింది. ఈ వ్యవహారం 2025 ఏప్రిల్‌లో హైకోర్టు ముందుకు రావడంతో.. సర్వే నంబర్ 83లోని 17.30 ఎకరాలతోపాటు ఆ చుట్టుపక్కల సర్వే నంబర్లలోని భూముల క్రయవిక్రయాలను నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అసలు కొనుగోలుదారుల్లో ఒకరి వారసురాలు హైకోర్టును ఆశ్రయించారు.

## ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యమన్నారు. పరిశోధనలకు ఊతమిచ్చేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్‌ను ప్రారంభించామని ఆయన తెలిపారు. యశోద ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ జి.ఎస్. రావు మాట్లాడుతూ.. ఆరోగ్యరంగంలో ఏఐ వినియోగం వైద్యసేవల నాణ్యత, వేగం, ఖచ్చితత్వాన్ని గణనీయంగా మెరుగుపరుస్తోందన్నారు. రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ చినబాబు సుంకవల్లి మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు కేవలం ఒక సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాదని, అది ఆరోగ్యరంగ భవిష్యత్తును పునర్నిర్వచిస్తున్న పరివర్తనాత్మక శక్తి అని పేర్కొన్నారు.

## తదుపరి ఆర్మీచీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్

(మొదటి పేజీ తరువాయి)

కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయం లోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్, ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

- 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు

**హైదరాబాద్, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025'26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

# రాష్ట్రవ్యాప్తంగా జోరు వాన

(మొదటి పేజీ తరువాయి)

రహదారులు జలమయమయ్యాయి. ఖైరతాబాద్‌లోని మింట్‌కాంపౌండ్ మార్గంలో భారీ వృక్షం నేలకూలగా.. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రాజేంద్రనగర్, రామచంద్రాపురం, లింగంపల్లి, గచ్చిబౌలి, ఖైరతాబాద్, పంజాగుట్ట, బంజారాహిల్స్, మాదాపూర్, ఎర్రగడ్డ, మోహిదీపట్నం ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నెలకొంది. ఆనంద్‌నగర్, బోయినపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇంటిపై తాటిచెట్టు పడడంతో వృద్ధురాలు లక్ష్మీ సేవ్యా(75) మృతి చెందారు. భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో గంటకుపైగా భారీ వర్షం కురవగా.. 65వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బలమైన ఈదురు గాలులకు ఎస్.లింగోటం, తాళ్ల సింగారం ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోయాయి. మునుగోడు పత్తి మిల్లు వద్ద చౌటుప్పల్ రోడ్డుపై వరద రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మర్రివాగు వంతెన వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు వరద ప్రవాహానికి తెగిపోయింది. సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సంగారెడ్డి మండలం ఇరిగిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు



అమరుస్తుండగా విద్యుదాఘాతానికి గురై అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి చెందారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం లక్ష్మీపురంలో వర్షం ధాటికి 25ఎకరాల్లో వేసిన అరటి పంట ధ్వంసమైంది. ఇదే మండలంలోని తిమ్మంపేటలో గేదెల షెడ్డు కూలిపోయింది. దీంతో రూ:10లక్షల నష్టం వచ్చినట్లు షెడ్డు యజమాని సంత్‌షరెడ్డి పేర్కొన్నారు. వర్ధన్నపేట మండలం కోనాపురంలో పలువురి ఇళ్ల పై కప్పులు ఎగిరిపోయాయి. కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం చింతిర్యాలగూడేనికి చెందిన పాయం నాగరాజు(31), ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కరంజి(కె) గ్రామానికి చెందిన దుర్ల భూమన్న(69) వడదెబ్బకు గురై మృతి చెందారు.

రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

### సీఎం సమీక్ష.. హైదరాబాద్‌లో హై అలర్ట్

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్మాత్యక ప్రాంతాల్లో ఎమర్జెన్సీ బృందాలను మోహరించాలని సూచించారు. కాగా, రోడ్లు భవనాల శాఖలో సీఈ నుంచి ఏఈ వరకు అన్ని స్థాయిల ఇంజినీర్లు క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని మంత్రి కోమటిరెడ్డి ఆదేశించారు. రోడ్లు దెబ్బతిన్నా, కోతకు గురైనా తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజా రవాణాకు అంతరాయం కలగకుండా చూడాలని చెప్పారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రోడ్లు, వంతెనల పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో వర్షప్రభావిత ప్రాంతాలను డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా పరిశీలించారు. టోలిచౌకి పరిధిలోని మల్కంపేట చెరువుతోపాటు పలు ప్రాంతాలను సందర్శించి.. సైబరాబాద్ సీపీ రమేషను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

- గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం
- మంత్రులతో కలసి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ
- 335 మంది డిపెండెంట్ కార్మికులకు నియామక పత్రాలు
- కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంది: భట్టి

**మంచిర్యాల, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

కేవలం దైవభక్తి కోసమే కాకుండా, సమాజంలో మార్పు కోసం విద్యకు, రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారంతా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన మార్పులు తీసుకురావచ్చని తాము గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మడేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన పిప్పిరి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈ రోజు భూమి పూజ చేసుకోవడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ. 70 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంపొందించేం



దుకు తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2,216 కోట్లతో వివిధ దేవాలయాలను అభివృద్ధి చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల సరస్వతీ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం కూడా రూ. 802 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవైపు దైవభక్తి కోసం నిధులు ఇస్తూనే, మరోవైపు అన్నదాతలను ఆదుకునేందుకు రూ. 74 కోట్ల వ్యయంతో 'గూడెం లిఫ్ట్ ఇరిగేషన' పనులను కూడా చేపడుతున్నామని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు వితల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

- ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ

**హైదరాబాద్, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

వినాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం విడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. వినాక్షి నటరాజన్‌పై కేసు ఏవి లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం వినాక్షి నటరాజన్ అని



పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. వినాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.వినాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

**హైదరాబాద్, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతంలో ట్యాపింగ్‌కు గురైన వాటిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నంబర్ కూడా ఉండటంతో.. ఆయన స్టేట్‌మెంట్‌ను సిట్ రికార్డు చేసింది. 2023 ఎన్నికల సమయంలో తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు తెలిపారు. మంత్రి ఇంటికెళ్లి.. ఆయన వినియోగించిన నంబర్ చూపి వివరాలు, స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.

## శత్రు దేశాల బాలిస్టిక్ క్షిపణులకు..5 వేల కి.మీ. దూరంలోనే చెక్

- బీఎండీ ఫేజ్-2 వ్యవస్థను విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో

**అల్వాల్, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

శత్రుదేశాలు ప్రయోగించిన బాలిస్టిక్ ఖండాంతర క్షిపణులను 5వేల కిలోమీటర్ల దూరంలోనే అడ్డుకొని ధ్వంసం చేసే 'బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ (బీఎండీ) ఫేజ్-2' వ్యవస్థను మన డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. డీఆర్‌డీవో పరీక్షించినవాటిలో రెండు తదుపరి తరం ఇంటర్‌సెప్టర్ క్షిపణులు ఉండగా.. మరొకటి నేవల్ యాంటీ షిప్ క్షిపణి. ఒడిశా తీరంలోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి జూన్ 10, 11 తేదీల్లో ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ వ్యవస్థ శత్రు క్షిపణులను అంతరిక్షంలో లేదా వాతావరణ పరిధిలో ముందే గుర్తించి వాటిని తుత్తునియలు చేస్తుంది. ఇంతటి అధునాతన వైమానిక రక్షణ వ్యవస్థ అమెరికా, రష్యా, చైనా, ఇజ్రాయెల్ వద్ద మాత్రమే ఉంది. ఈ పరీక్షల ద్వారా.. అత్యున్నత స్థాయి రక్షణ వ్యవస్థ గల ఆ దేశాల సరసన భారత్ చేరినట్లయిందని రక్షణ శాఖ తెలిపింది. అలాగే.. నేవల్ యాంటీషిప్ మిస్సైల్ మీడియం రేంజ్ తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డీఆర్డఈవో విజయవంతంగా నిర్వహించింది. మీడియం రేంజ్‌లోని శత్రువుల యుద్ధనౌకలే లక్ష్యంగా కచ్చితమైన దాడులు చేయగల సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో శాస్త్రజ్ఞులను అభినందించారు. ''లాంగ్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణుల నుంచి బహుళ అంచెల రక్షణను, అలాగే మీడియం రేంజ్‌లో శత్రు నౌకలను అడ్డుకునే సత్తా మనకుందని నిరూపించే 3 పరీక్షలను వరుసగా నిర్వహించాం'' అని అన్నారు.

## మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు

### షబ్బీర్ అలీకి ఏఐసిసి షోకాజ్ నోటీస్

**హైదరాబాద్, జూన్ 13 (వార్త వేదిక సూర్య):**

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హై కమాండ్ చర్యలకు దిగింది. ఈ వైరల్ అయిన ఆడియోలో షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆడియో సోషల్ విడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అదే సమయంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.




## ఫ్రాన్స్‌లో జీ'7 దేశాల సదస్సు

**న్యూఢిల్లీ, జూన్ 13:** భారత ప్రధాని నరేంద్ర మోది విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.






## మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని కలిసిన నాయకులు

**- కృతజ్ఞతలు తెలిపిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి**

చౌటుప్పల్ వార్త వేదిక సూర్య

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యతో కలిసి చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన బోయ దేవేందర్, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు హైదరాబాదులోని నివాసంలో శనివారం కలిశారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ తమకు అవకాశం కల్పించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కంకణ బద్ధులమై పనిచేస్తామన్నారు. పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

## హస్త కళలను కాపాడుకోవాలి

**బి ఫ్యాషన్ డిజైనర్ కృష్ణమూర్తి**

చౌటుప్పల్ వార్త వేదిక సూర్య



దండు మల్కాపురం (చౌటుప్పల్): హస్త కళలను కాపాడుకోవాలని, ముందు తరాలకు అందించాలని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ కే. కృష్ణమూర్తి కోరారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం టెక్స్ టైల్ పార్కులోని మిమి క్రాఫ్ట్స్ ను హైదరాబాదుకు చెందిన అర్నిత ఫ్యాషన్ డిజైనింగ్ కళాశాలకు చెందిన విద్యార్థుల బృందం శనివారం సందర్శించింది. వారితో కృష్ణమూర్తి మాట్లాడుతూ, భారతదేశంలో పూర్వ కాలం నుంచి బాతిక్, స్క్రీన్, బ్లాక్, టై అండ్ డై ప్రింటింగ్ పద్ధతులు వివిధ రూపాల్లో అమలులో ఉన్నాయని తెలిపారు. మారుతున్న ఫ్యాషన్లకు అనుగుణంగా ఈ కలలను నవీకరించి నూతన డిజైన్లను సృష్టించి ప్రజలకు అందించాల్సిన బాధ్యత కళాకారులపై, ఫ్యాషన్ డిజైనర్ లపై ఉందని వివరించారు. ఈ ప్రాచీన కళలతో నేటి ఫ్యాషన్లకు అనుగుణంగా వస్త్రాలను తయారు చేసే పద్ధతులను ఆయన ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. మిమి క్రాఫ్ట్స్ నిర్వాహకురాలు పుష్పలత, తిరుపతికి చెందిన దివ్య, ఫ్యాషన్ డిజైనింగ్ కళాశాల అధ్యాపకులు రచన, హర్షిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ నెల15న అర్వపల్లి జరిగే బి.ఆర్.ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలి

మోత్కూరు, జూన్ 13 ( వార్త వేదిక సూర్య);



ఈనెల 15న సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల కేంద్రంలో జరిగే బి.ఆర్.ఎస్. నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మండల,మున్సిపల్ పరిధిలో ఉన్న బి. ఆర్.ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని బి.ఆర్.ఎస్. మండల, పట్టణ అధ్యక్షులు పోన్నెబోయిన రమేష్, జంగ శ్రీను శనివారం ఒక ప్రకటనలో కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై , పార్టీ బలోపేతంపై చర్చించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే గాదారి కిషోర్ కుమార్,బి.ఆర్.ఎస్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు

# ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజును తగ్గించాలి

**- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లె మధుకృష్ణ గడ్డం వెంకటేష్**

చౌటుప్పల్ వార్త వేదిక సూర్య




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజులు పెంచడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత అనేక ఇబ్బందులు పడుతున్నారని పెంచిన ఉద్యోగ దరఖాస్తుల ఫీజులను తగ్గించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లె మధుకృష్ణ గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం కందాల రంగారెడ్డి స్మారక భవనంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ఊరట కలిగించకుండా ఉద్యోగ దరఖాస్తు ఫీజులను 200 నుండి వెయ్యి రూపాయలకు పెంచడం నిరుద్యోగులపై మరింత భారాన్ని మోపినట్లే అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక మంది నిరుద్యోగులు హాస్టల్లో ప్రైవేటు సంస్థలలో కోచింగ్లు తీసుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఒకేసారి ఫీజులు పెంచడం ద్వారా ఒక నిరుద్యోగి నాలుగు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలి అనుకుంటే 4000 రూపాయలు దరఖాస్తుకే అవుతుందని వారి రోజువారి ఖర్చులు ఏ రకంగా జీవనం కొనసాగుతుందని దీని ద్వారా ఉద్యోగ దరఖాస్తు కే నిరుద్యోగి దూరం కావలసిన పరిస్థితి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో భయాందోళనలో నిరుద్యోగులు పడ్డారని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగంపై దృష్టి పెట్టకుండా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యూత్ డిక్లరేషన్ పై స్పష్టమైన హామీ ఇవ్వకుండా ఉద్యోగ దరఖాస్తు ఫీజులను పెంచడం కాంగ్రెస్ నిరంకు చెప్పాలనకు నిదర్శనంగా కనిపిస్తుందని వారు అన్నారు. వెంటనే పెంచిన ఫీజులను వెనక్కి తీసుకొని రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు వీరితో పాటు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం, సహాయ కార్యదర్శి ఖయ్యూం, జిల్లా కమిటీ సభ్యులు బండారు శ్రవణ్ రత్నం శ్రీకాంత్ పల్లె శివ తదితరులు పాల్గొన్నారు

# ఉప సర్పంచ్ల ఫోరం చౌటుప్పల్ మండల అధ్యక్షునిగా బొమ్మకంటి కిషోర్ కుమార్

చౌటుప్పల్ వార్త వేదిక సూర్య

ఉప సర్పంచ్ల ఫోరం చౌటుప్పల్ మండల అధ్యక్షునిగా బొమ్మకంటి కిషోర్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కొయ్యలగూడెం గ్రామంలోని రెక్కల సత్తిరెడ్డి గార్డెన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో నిర్వహించబడింది. గౌరవ అధ్యక్షులుగా మీసాల నరసింహ, ఉపాధ్యక్షులుగా జెల్ల పవన్ కుమార్, బాతరాజు ధనుంజయ్, పల్చం జయమ్మ, ప్రధాన కార్యదర్శిగా బోయ సదానందం, కార్యదర్శిగా శ్యామల చిరంజీవి, కార్యనిర్వహణ అధ్యక్షులుగా కందగట్ల సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా నిమ్మల సత్యనారాయణ, ముద్దం రమేష్ యాదవ్, కోశాధికారిగా వలం దాసు మహేష్ గౌడ్, గౌరవ సలహాదారులుగా పిన్నింటి శ్రీనివాసరెడ్డి, ఉప్పునూతల నరసింహ, సుర్కంటి ప్రభాకర్ రెడ్డి, ఫకీరు శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులుగా బోయిని లింగస్వామి యాదవ్, గడ్డం సత్తయ్య, పెరుమాండ్ల లింగస్వామి, బక్కన్న గారి శ్రవణ్ కుమార్, సామిడి శ్రీనివాస్ రెడ్డి, సుర్కంటి అనుపు రెడ్డి,డి రాజు, కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు

ఈ సందర్భంగా పలువురు ఉప సర్పంచులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారం, ఉప సర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం బొమ్మకంటి కిషోర్ కుమార్ సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏకగ్రీవంగా తనను మండల అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల బొమ్మకంటి కిషోర్ కుమార్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఉప సర్పంచులందరినీ కలుపుకొని మండలంలోని గ్రామాల అభివృద్ధి, ఉప సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలువురు ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై నూతన అధ్యక్షుడు బొమ్మకంటి కిషోర్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## నేడు ఇందిరాపార్క్ వద్ద జరిగే సీజేపీ సభకు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు

మోత్కూరు, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ):

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం , కేంద్ర ప్రభుత్వానికి వైఫల్యానికి నిదర్శనమని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న హైదరాబాద్ లోని ధర్నా చౌక్ ఇందిరా పార్క్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ( సిజెపి) చేపట్టనున్న బహిరంగ సభకు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్ ) జిల్లా కమిటీ పక్షాన మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ళ శేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో లక్షల మంది విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలకు హాజరవుతుంటే ప్రశ్న పత్రాలు లీకేజీల కారణంగా వారి భవిష్యత్ అనిశ్చితిలో పడుతోందన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండా కొనసాగడం సిగ్గుచేటని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం యువతకు ఉ ద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఖాళీగా ఉన్న లక్షణాలు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తూ యువత జీవితాలను అంధకారంలోకి నెడుతోందన్నారు. నీట్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మేంద్ర ప్రధాన్ పై చేపట్టనున్న ఈ సభకు యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# నిమ్స్ ఆసుపత్రిలో అత్యాచార బాధిత చిన్నారిని పరామర్శించిన డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

హైదరాబాద్ వార్త వేదిక సూర్య

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం జిల్లా రాపర్తి నగర్‌కు చెందిన అత్యాచార బాధిత చిన్నారి మరియు ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పరామర్శించారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, బీజేపీ పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అవసరమైతే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జె.పి. నడ్డా తో మాట్లాడి, ఢిల్లీలోని ఎయిమ్స్ నిపుణుల వైద్య బృందం ద్వారా ప్రత్యేక చికిత్స అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.



అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఐసీయూలో చికిత్స పొందుతున్న చిన్నారి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారికి రెండు కాళ్లు, రెండు చేతులు, వెన్నెముక విరగడంతో పాటు తీవ్ర గాయాలు అయ్యాయని, ప్రస్తుతం పక్షవాతం (పారాలిసిస్) కారణంగా నడుము కింది భాగం పూర్తిగా పనిచేయడం లేదని తెలిపారు. చిన్నారి అనుభవిస్తున్న బాధ, తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతమని పేర్కొన్నారు.

ఇంతటి ఘోర సంఘటన జరిగినప్పటికీ రెండు రోజుల పాటు కేసు నమోదు చేయకపోవడం అత్యంత బాధాకరమని, దీనికి బాధ్యులైన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడికి సహకరించిన వారిని సైతం చట్టపరంగా శిక్షించాలని కోరారు.

ఈ దారుణ ఘటనకు కారణమైన నిందితుడిపై వేగవంతమైన విచారణ జరిపి, అత్యంత కఠినమైన శిక్ష విధించాలని బీజేపీ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. సమతా, బీజేపీ మెడికల్ సెల్ కో-కన్వీనర్ రష్మి , ఇతర నాయకులు పాల్గొన్నారు

## బండ్ పేపర్ లేక ప్రజలు అవస్థలు

మోత్కూరు, జూన్ 13 ( వార్త వేదిక సూర్య):



మోత్కూరు మున్సిపల్ పరిధిలోని సబ్ రిజిస్టార్ కార్యాలయంలో గత రెండు నెలల నుంచి బండ్ పేపర్ లేక మున్సిపల్ , మోత్కూరు మండలానికి అనుసంధానంగా ఉన్న ఆత్మకూరు (ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బారాస యువజన విభాగం రాష్ట నాయకులు చొల్లేటి నరేష్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ బండ్ పేపర్లు లేక వివిధ భూములు,పాట్లు కొనుగోలు చేయాలన్నా, అమ్ముకోవాలన్నా ఈ పేపర్లే కీలకంగా మారాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా, అధికారులు వెంటనే స్పందించి బాండ్ పేపర్లు ఇక్కడ అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం బియ్యం అందజేత

మోత్కూరు, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ):



మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన పోతరాజు అంజయ్య ఇటీవల ఆకాల మృతిచెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన అంజయ్య కుటుంబానికి గ్రామస్థుల నుండి సేకరించిన నగదు రూ.24,700 లను శనివారం గ్రామస్థులు మృతుని భార్య వరమ్మ, అందజేశారు. అదేవిధంగా గుండాల మండలంలోని కొమ్మాయిపల్లి సర్పంచ్ తాంద్ర నారాయణ స్వామి 50కేజీల బియ్యాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కురిమేటి యాదయ్య, కురిమేటి యాదయ్య, చిరుమర్తి రాజు, చింత ఎల్లయ్య, కురిమేటి సాయికుమార్, కురిమేటి సోమయ్య,తాళ్ళపల్లి రామక్క చిరుమర్తి సోమయ్య, కురిమేటీ సాయిలు, కురుమేటి విక్రమ్, కురుమేటి ఎల్లయ్య, కురుమేటి సుమన్, సిరిపురం యాదయ్య, కురుమేటి సైదులు, అంబాల జీవన్,తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలి

తుర్కపల్లి, వార్త వేదిక సూర్య

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం బద్దూ తండ, బిల్యా నాయక్ తండ, ధర్మారం గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ శాఖ మహిళ అధ్యక్షుల నియామకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బద్ధతండ గ్రామ శాఖ అధ్యక్షురాలుగా గూగుల్ లక్ష్మి, బిల్యా తండా గ్రామ శాఖ అధ్యక్షురాలుగా భూక్య సరోజ, ధర్మారం గ్రామ శాఖ అధ్యక్షురాలుగా కుంభం సబిత లను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం జిల్లా ప్రచార కార్యదర్శి భూక్య రాజారాం నాయక్, సర్పంచులు గుగులోతు కవిత శ్రీను నాయక్, సోన్నాయిల



రఘు, ధనావత్ రజని సురేందర్ నాయక్, బానోతు సతీష్ నాయక్, నాయకులు ధనావత్ భాస్కర్ నాయక్, దేవరుప్పల ఐలయ్య పాల్గొన్నారు

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం
జూన్ 14, 2026
సంపుటి : 2 సంచిక : 25
Follow:

# మహానేతల పేర్లతో ఉన్న పార్కుల దుస్థితి.. ప్రజా ధనానికి ఇదేనా గౌరవం?

**- పార్కులు అభివృద్ధి చేయలేని పాలకులు ప్రజలకు ఏం అభివృద్ధి చేస్తారు?**

**- బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం**



రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
ప్రజల ఆరోగ్యం, విశ్రాంతి, పిల్లల భవిష్యత్తు కోసం నిర్మించిన పార్కులు నేడు నిర్లక్ష్యానికి ప్రతీకలుగా మారడం అత్యంత బాధాకరం. దేశానికి దిశానిర్దేశం చేసిన మహానేతలు పి.వి. నరసింహారావు, మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేర్లతో ఏర్పాటు చేసిన పార్కులు చెత్తకుప్పలుగా మారడం, పారిశుధ్యం లేక ప్రజలు అడుగుపెట్టలేని స్థితికి చేరుకోవడం అధికార యంత్రాంగం వైఫల్యానికి అద్దం పడుతోంది. మణికొండ, నెక్నాంపూర్ డివిజన్లలోని పలు పార్కులను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు అక్కడి పరిస్థితులను చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా నిర్మాణ వ్యర్థాలు తొలగించకపోవడం, చిన్నారుల ఆట పరికరాలు పాడైపోవడం, మహిళలు, వృద్ధులకు కనీస సౌకర్యాలు లేకపోవడం, చెత్త పేరుకుపోవడం, ప్రమాదకర విద్యుత్ తీగలు బహిరంగంగా ఉండటం వంటి అంశాలు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నాయని మండిపడ్డారు. ప్రజల కోసం నిర్మించిన పార్కులు నేడు సంఘవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డాలుగా మారడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. కోట్లాది రూపాయల ప్రజా ధనం ఖర్చు చేసినప్పటికీ ఫలితాలు కనిపించకపోవడం వెనుక ఎవరి నిర్లక్ష్యం ఉందో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
పార్కులు కేవలం చెట్లు, బెంచీలు కాదు... అవి సమాజ ఆరోగ్యానికి ఊపిరితిత్తులు. పిల్లల ఆటలు, యువత వ్యాయామం, వృద్ధుల విశ్రాంతి, మహిళల ఆరోగ్యకర జీవనానికి పార్కులు కేంద్ర బిందువులు. అలాంటి ప్రదేశాలు నిర్లక్ష్యానికి గురికావడం ప్రజల హక్కులను కాలరాయడమేనని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మహానేతల పేర్లు పెట్టడం మాత్రమే కాదు, వారి ఆదర్శాలకు తగిన విధంగా ఆ ప్రదేశాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారులు కార్యాలయాల్లో కూర్చోవడం మానేసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, మంజూరైన నిధులను పారదర్శకంగా వినియోగించి పార్కులను ఆదర్శవంతమైన ప్రజా వనరులుగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ప్రజా ధనం ప్రజల కోసమే... నిర్లక్ష్యం కోసం కాదు. పార్కులను కాపాడుకుందాం... భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిద్దాం అని బీఆర్ఎస్ నాయకులు పిలుపు నిచ్చారు.






## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

తుర్కపల్లి
కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ అన్నారు .శనివారం తుర్కపల్లి మండలం పలు గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులను నియమించారు. బద్ధతండ గ్రామ శాఖ అధ్యక్షునిగా గుగులోతు నరసింహ నాయక్, మల్కాపూర్ గ్రామ శాఖ అధ్యక్షునిగా అన్నోజు ఆనంద్ చారి, బిల్యా నాయక్ తండ గ్రామ శాఖ అధ్యక్షునిగా గుగులోతు తరుణ్ నాయక్, రామోజీ నాయక్ తండ గ్రామ శాఖ అధ్యక్షునిగా బానోతు శివ నాయకులను ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పని చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులకు చేరేలా చూడాలని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ధనావత్ భాస్కర్ నాయక్, బిసి సెల్ జిల్లా కోఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, మండల మహిళా శాఖ అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా ప్రచార కార్యదర్శి భూక్య రాజారాం నాయక్, సర్పంచులు గుగులోతు కవితా శ్రీను నాయక్, సోన్నాయిల రఘు, ధనావత్ రజనీ సురేందర్ నాయక్, బానోతు సతీష్ నాయక్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల శేఖర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పనిగట్ల సుదర్శన్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు



## ఖమ్మంలో 12 ఏళ్ల బాలికపై ఘాతుకం అత్యంత హేయం: ఉస్కామూరి విజయ్ కుమార్

రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
ఖమ్మంలో 12 సంవత్సరాల అమాయక బాలికపై జరిగిన దారుణ అత్యాచారం, అనంతరం సాక్ష్యాలను మాయం చేయడానికి ఆమెను భవనం పై నుంచి తోసివేసిన ఘటన అత్యంత అమానుషం మరియు హేయమైనదని రాజేంద్రనగర్ నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకుడు ఉస్కామూరి విజయ్ కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘోర సంఘటన యావత్ తెలంగాణ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మనుషులుగా తిరిగే అర్హత ఇలాంటి క్రూరమైన నేరాలకు పాల్పడే వ్యక్తులకు లేదని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి తక్షణమే పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలని, నిందితుడిపై కఠినమైన చట్టపరమైన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసు విచారణను ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో నిర్వహించి, త్వరితగతిన నిందితుడికి శిక్ష పడేలా చూడాలని ఆయన కోరారు. మహిళల భద్రతపై కఠినంగా వ్యవహరించాలి:రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దారుణాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేరస్తుల గుండెల్లో వణుకు పుట్టేలా చట్టాన్ని అమలు చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి స్థాయిలో భద్రతా చర్యలను బలోపేతం చేయాలని విజయ్ కుమార్ సూచించారు.

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి: తపస్ డిమాండ్





రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు మదగని బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణ డిమాండ్ చేశారు. వారు విడుదల చేసిన ప్రకటనలో, ఎన్‌సీటీఈ నిబంధనలకు అనుగుణంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా రాష్ట్రంలోని వేలాది మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రివ్యూ పిటిషన్లు కూడా తిరస్కరించ బడటంతో, 2028 ఆగస్టు 31లోపు టెట్ అర్హత సాధించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణలో సుమారు 30 వేల మంది ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించాల్సి ఉందని, ప్రభుత్వం అదనంగా టెట్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించడం కొంత ఊరటనిచ్చినా సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని పేర్కొన్నారు. 2010 ఏప్రిల్ 1కు ముందు చట్టబద్ధంగా నియమితులైన ఉపాధ్యాయులకు అప్పట్లో టెట్ అర్హత అవసరం లేదని స్పష్టంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం వారిపై అదే నిబంధనలను వర్తింపజేయడం అన్యాయ మని తపస్ అభిప్రాయపడింది. దశాబ్దాలుగా బోధనలో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు, తమ బోధనా అంశాలకు సంబంధం లేని సబ్జెక్టులపై కూడా టెట్ పరీక్ష రాయాల్సి రావడం సరైన విధానం కాదని పేర్కొంది. అలాగే ఎన్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో దీక్ష, నిష్ఠ వంటి అనేక శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరుచు కుంటున్నారని తెలిపింది. అందువల్ల 2010 ఏప్రిల్ 1కు ముందు నోటిఫికేషన్‌ల ద్వారా నియమితులైన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని, దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని ఒప్పించే దిశగా చర్యలు చేపట్టాలని తపస్ డిమాండ్ చేసింది.

## వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా..

**ఎమ్మెల్యే చేతుల మీదుగా చికిత్స కోసం రూ.2.50 లక్షల సహాయం అందజేత**



రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రజాప్రతి నిధుల బాధ్యత అని మరోసారి నిరూపించారు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ . రాళ్లగూడకు చెందిన గాయత్రీ మిల్క్ సెంటర్ నిర్వాహకుడు రవి చిన్నమ్మ చిర్ల బాబమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆమె వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్ ) ద్వారా మంజూరైన రూ.2,50,000/- (రెండు లక్షల యాభై వేల రూపాయలు) చెక్కును ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరంగా మారిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో తాను అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు.
చిర్ల బాబమ్మ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ కుటుంబానికి అత్యంత క్లిష్ట సమయంలో అందించిన ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దూడల వెంకటేష్, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, జెట్ట సీదులు, బంటి సంజయ్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## వర్షాల దెబ్బకు కూలిన పాత గోడ

**-శంషాబాద్‌లో కారుపై పడి ధ్వంసం, తృటిలో తప్పిన విషాదం**

రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పాత భవనాల ప్రమాదకర పరిస్థితిని మరోసారి బయటపెట్టాయి. శంషాబాద్‌లోని ఓల్డ్ పీఎస్ మసీదు సమీపంలో శిథిలావస్థలో ఉన్న ఓ పాత ఇంటి గోడ అకస్మాత్తుగా కూలిపడి పక్కనే నిలిపి ఉంచిన కారుపై పడింది. దీంతో కారు తీవ్రంగా దెబ్బతింది. ఘటన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. భారీ శబ్దంతో గోడ కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లు, గోడలు, భవనాలు ప్రజలకు ముప్పుగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకర నిర్మాణాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని లేదా తొలగించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వర్షాకాలంలో పాత భవనాల సమీపంలో వాహనాలు నిలిపివేయకుండా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

## సేవకు సాహితీ గౌరవం..

**మండువ మధుసూదన్ శర్మకు కాళోజీ పురస్కారం**

రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :




తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాల సందర్భంగా శనివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వరంగల్‌లోని తెలంగాణ నాన్ గజిటెడ్ అధికారుల సంఘ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు.
ఈ కార్యక్రమంలో మణికొండ పరిసర ప్రాంతాల్లో సామాజిక, సేవా కార్యక్రమాల ద్వారా విశేష గుర్తింపు పొందిన మండువ ఫౌండేషన్ అధ్యక్షులు మండువ మధుసూదన్ శర్మను ప్రత్యేకంగా సత్కరించారు. సాహిత్య సేవా రంగంలో ఆయన చేసిన కృషిని గుర్తించి కాళోజీ నారాయణరావు సాహితీ గౌరవ పురస్కారం అందజేశారు. పురస్కారం అందుకున్న అనంతరం మండువ మధుసూదన్ శర్మ మాట్లాడుతూ, తన సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, తనకు లభించిన ఈ గౌరవాన్ని సార్థకం చేసు కుంటానని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా జరిగిన ఈ సత్కారం స్థానిక సాహితీ, సామాజిక వర్గాల్లో హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు.

## ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాశీగారి యాదగిరి**



రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ) ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాశీగారి యాదగిరి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, 2002 మరియు ప్రస్తుత ఓటరు జాబితాల ఆధారంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అవుతాయని తెలిపారు. ప్రతి ఓటరు తమకు వర్తించే స్వీయ అనుసంధానం, వారసుల నమోదు, స్వీయ వారసుల నమోదు ప్రక్రియలను బూత్ స్థాయి అధికారుల సహకారంతో పూర్తి చేసుకోవాలని సూచించారు. పెళ్లి తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు తమ పుట్టిన ఊరిలోని 2002 ఓటరు జాబితా వివరాలను సేకరించి, ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతంలోని బూత్ స్థాయి అధికారికి అందజేసి అనుసంధానం చేయించు కోవాలని వివరించారు. అలాగే గ్రామాలు, కాలనీలు, వార్డుల వారీగా ప్రజలకు అవగాహన కల్పించి, ఒక్క అర్హ ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయకపోతే ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉండటంతో పాటు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మీ ఓటు -- మీ హక్కు, మీ భవిష్యత్తు. ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్‌ను సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలి అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాశీగారి యాదగిరి పేర్కొన్నారు.

## ఓట్లు గల్లంతు కాకుండా జాగ్రత్త పడాలి

సికింద్రాబాద్, జూన్ 13(వార్త వేదిక సూర్య)





అర్హులు ఓట్లు గల్లంతు కాకుండా జాగ్రత్త పడాలని బౌద్ధనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు బౌద్ధనగర్ డివిజన్ ఎల్ఎన్ నగర్ 167, 177 బూత్ పరిధిలోని ఇంటి ఇంటికి తిరుగుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎల్ఎన్ నగర్ లో పర్యటించి అక్కడ ఉన్న బస్తి వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మీకు ఎ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు ఆ సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజ్ సుందర్, రాజేందర్, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, రాజేష్, కలిం, మస్తాన్ బాబా, ఇమ్రాన్, ప్రసాద్, రాము, సతీష్, కృష్ణకుమారి, భూలక్ష్మి, జయశ్రీ తదితరులున్నారు




# పత్తికుంటపై అధికారుల నిర్లక్ష్యం..

**30 ఏళ్లుగా హామీలే గానీ అభివృద్ధి ఎక్కడ?**
**వినాయక నిమజ్జనాలకు వేలాది మంది వస్తున్నా పత్తికుంట దుస్థితి యథాతథం**
**- ప్రతి ఏడాది హామీలు.. ప్రతి ఏడాది అదే కథ**
**- పత్తికుంట శ్రీధర్ గా గుర్తింపు వచ్చిందే కానీ చెరువుకు న్యాయం జరగలేదు**



రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పత్తికుంట అభివృద్ధి విషయంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై. శ్రీధర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృగశిర కార్తె ప్రారంభమైన వెంటనే వర్షాలు కురిసి పత్తికుంటలో నీరు చేరడం శుభపరిణామమే అయినప్పటికీ, మరోసారి అభివృద్ధి పనులు అటకెక్కిపోయే పరిస్థితి నెలకొనడం బాధాకరమని అన్నారు.ప్రతి సంవత్సరం వినాయక నిమజ్జనాల సమయంలో దాదాపు 18 శాఖల అధికారులు పత్తికుంట వద్దకు వచ్చి పరిస్థితులను పరిశీలిస్తారని, వచ్చే ఏడాది చెరువును అభివృద్ధి చేస్తాం అంటూ హామీలు ఇస్తారని, కానీ నిమజ్జనాలు పూర్తయ్యాక ఆ హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు.
గతంలో పనిచేసిన కమిషనర్లు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు అందరూ పత్తికుంటను చూసి అభివృద్ధి చేస్తామని చెప్పినా, ఇప్పటి వరకు ఒక్క శాశ్వత చర్య కూడా కనిపించలేదని మండిపడ్డారు. తాను ఎన్నోసార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడంతో అధికారులు తనను "పత్తికుంట శ్రీధర్" అని పిలుస్తూ నవ్వుకుంటున్నారని, కానీ తన బాధను అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
పత్తికుంట కేవలం ఒక చెరువు మాత్రమే కాదని, వేలాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 10 వేల నుంచి 15 వేల వరకు వినాయక విగ్రహాలు ఇక్కడ నిమజ్జనం అవుతుండగా, రాజేంద్రనగర్, శంషాబాద్, అత్తాపూర్, మణికొండ, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ తదితర ప్రాంతాల ప్రజలతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా కుటుంబ సమేతంగా భక్తులు ఇక్కడికి తరలివస్తారని తెలిపారు.గత 30 ఏళ్లుగా పత్తికుంట వినాయక నిమజ్జనాలకు ప్రధాన కేంద్రంగా కొనసాగుతున్నప్పటికీ, సరైన రోడ్లు, పార్కింగ్, లైటింగ్, భద్రతా ఏర్పాట్లు, చెరువు పరిరక్షణ వంటి అంశాల్లో అభివృద్ధి లేకపోవడం విచారకర మన్నారు. నగర నడిబొడ్డున ఉన్న ఇంత ముఖ్యమైన చెరువు అభివృద్ధికి నోచుకోకపోవడం ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.ఇటీవల చెరువు శుభ్రపరిచే పనుల కోసం షార్ట్ టెండర్లు పిలిచినా, పనులు ప్రారంభం కాకముందే వర్షాలు మొదలవడంతో మరోసారి ఆశలు నీరుగారాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, ఈసారి అయినా అధికారులు మాటలకే పరిమితం కాకుండా కార్యాచరణతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. వేలాది మంది భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా మారిన పత్తికుంటకు శాశ్వత అభివృద్ధి ఎప్పుడు? ప్రజల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందిఅని వై. శ్రీధర్ స్పష్టం చేశారు.

# సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

**- నర్కూడలో కంటి వెలుగు: పేదలకు ఉచితంగా మందులు, కళ్లద్దాల పంపిణీ**



రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
శంషాబాద్ మండలం నర్కూడ గ్రామ పంచాయతీ కేంద్రంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం (ఫ్రీ ఐ క్యాంప్) నిర్వహించారు. నర్కూడ గ్రామ సర్పంచ్, శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్య బృందం గ్రామ ప్రజలకు క్షుణ్ణంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాధితులకు అవసరమైన మందులతో పాటు, కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తొంట అశోక్, స్థానిక వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు నర్కూడ గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# పోరాటంతోనే కార్మికుల సమస్యల పరిష్కారం:




**రాష్ట్ర అధ్యక్షుడు కే.రవిచంద్రన్, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**

రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్యంగా పోరాటం చేయడమే ఏకైక మార్గమని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ ఉ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు కే.రవిచంద్రన్, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్‌కేసర్ సర్కిల్ మహిళా భవనంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసినప్పటికీ, కార్మికులకు జీహెచ్ఎంసీ వేతనాలు అమలు చేయకుండా పాత మున్సిపాలిటీ వేతనాలనే కొనసాగించడం అన్యాయమని విమర్శించారు. జనవరి 2026 నుంచి జీహెచ్ఎంసీ వేతనాలు అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులకు వారసత్వ ఉద్యోగాలు, విధుల్లో మరణించిన లేదా అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని, వాటర్‌మెన్, ఎలక్ట్రిషియన్‌లు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాల్లో కోతలు నిలిపివేయాలని కోరారు. కార్మికులకు పండుగ సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జూన్ 23, 24 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ ఉ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ 4వ మహాసభలు నిర్వహించ నున్నట్లు ప్రకటించారు. కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందించ నున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మద్దిలేటి, ఏఐటీయూసీ నాయకులు కల్లూరి జయచంద్ర, సీపీఐ నాయకులు, యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బూచి నెల్లి పాఠశాలలో కొనసాగుతున్న బడిబాట



కూకట్ పల్లి, జూన్ 13 (వార్త వేదిక సూర్య) :
మన ఊరు మన బడిలో పిల్లల్ని చేర్పించి మన ఊరి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని మండల విద్యాధికారి మా అన్నయ్య అన్నారు. శనివారం జహీరాబాద్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూచి నెల్లి లో మండల విద్యాధికారి మాణయ్య, గ్రామ సర్పంచ్ సునీత శ్రీనివాస్, గ్రామ సెక్రెటరీ అంబికా, ఉపాధ్యాయులతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమము కొనసాగింది. బడిబాట కార్యక్రమములో భాగంగా గ్రామంలోని రైతు కూలీలు, ఉపాధి హామీ పథకం మహిళలు డ్వాక్రా మహిళలతో క్షేత్రస్థాయిలో సమావేశం ఏర్పాటు చేశారు. మండల విద్యాధికారి మాణయ్య మాట్లాడుతూ పాఠశాల నిర్వాహణలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత కీలకమో అంతే బాధ్యత మహిళా సంఘాలది కూడా అని అన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళా సంఘాల అభ్యర్థులకే పాఠశాల చైర్పర్సన్ పదవి ఇచ్చారు అని గుర్తు చేశారు. మహిళా చైర్ పర్సన్ ల ఆధ్వర్యంలోనే మన పాఠశాలలు కొనసాగుతున్నాయి అన్నారు. మీ పిల్లలను మన ఊరు మన బడిలో చేర్పించి మన ఊరి బడి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సర్కారు బడిలోనే నైపుణ్యం గల ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను మన విద్యార్థులకు బోధిస్తున్నారని అన్నారు. విద్యార్థుల పట్ల చదువులో ప్రత్యేక శ్రద్ధ వహించడం వల్లనే 2026 సంవత్సరానికి 10వ తరగతిలో డి .సహస్ర 540, సి .సమంతా 529, హెప్సిబా 525, ఏ .వీణ కుమారి 515, ఎం .అమూల్య 511 మార్కులు సాధించి మండల స్థాయిలో టాపర్లుగా మన విద్యార్థులు నిలిచారన్నారు. తదుపరి గ్రామ సర్పంచ్ సునీత శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల పట్ల విద్యార్థుల- తల్లిదండ్రులలో భిన్నాభిప్రాయాలు ఉండేవి అని, అవి కేవలం వారిలో ఉన్న అపోహ మాత్రమే అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎక్కువ శాతం విద్యార్థులు ఉన్నతమైన స్థాయిలో, ఉద్యోగాలలో ఉన్నారన్నారు. అని, నేను కూడా మన ఊరు పాఠశాలలో చదువుకొని గ్రామ సర్పంచుగా కొనసాగుతున్నాను అని చిరునవ్వుతో అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ హేమలత, పాఠశాల ఉపాధ్యాయులు లాలయ్య, ఎం గోపాల్, మై బల్లి ఏ సురేష్ బాబు, ఎన్ నర్సింలు, సంజీవ్ కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**- రూ.2.05 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**- 121వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం**

రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
121వ డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో రూ.2.05 కోట్ల నిధులు మంజూరై, సీసీ రోడ్లు మరియు డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనకార్యక్రమం ఘనంగా నిర్వహించారు.పద్మశ్రీ హిల్స్, తిరుమల గార్డెన్, నర్సారెడ్డి కాలనీ, పీఎన్‌టీ బీ-బ్లాక్, డాక్టర్ కాలనీ ప్రాంతాల్లో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రహదారులు, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది అన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, అభివృద్ధే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్ , సాగర్ గౌడ్ , సురేష్ గౌడ్ , సుమన్ , నదీమ్ , రాజు యాదవ్ , హఫీజ్ ఖాన్ , కాలనీ అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## భక్తి సాహిత్యానికి మహోత్సవం

రాజేంద్రనగర్, జూన్ 13 ( వార్త వేదిక సూర్య ) :
భక్తి సాహిత్యాన్ని ప్రజల్లో మరింత విస్తరింపజేయాలనే లక్ష్యంతో ప్రముఖ రచయిత, నంది పురస్కార గ్రహీత మన్నె మహాత్మరావు (మన్నెశ్రీ) రచించిన మన్నె శ్రీ భజన కీర్తనలు -- గ్రంథావిష్కరణ కార్యక్రమం ఈ నెల 14న కిస్మత్‌పూర్ హనుమాన్ దేవాలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ప్రచురణకర్త నీరుడు శేఖర్ ముదిరాజ్ వెల్లడించారు.ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు భజన కార్యక్రమాలు, అనంతరం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గ్రంథావిష్కరణ సభ జరగనుంది. భక్తి భావనను పెంపొందించే కీర్తనల సమాహారంగా రూపొందిన ఈ గ్రంథం భక్తులకు, సాహిత్యాభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. భక్తి, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు అంకితమైన ఈ కార్యక్రమంలో భక్తులు, మన్నెశ్రీ అభిమానులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## డ్రైనేజ్ సమస్యల పరిష్కారంలో వేగవంతమైన చర్యలు

సికింద్రాబాద్, జూన్ 13(వార్త వేదిక సూర్య)



డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజ్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానిక ప్రజలు తెలియజేయడంతో వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ శనివారం వివిధ అధికారులతో కలిసి పర్యటించిసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరిగింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్, యువ మోర్చా అధ్యక్షుడు సాయి, రాహుల్ యాదవ్, హరి, నర్సింగ్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపీఎస్ ను కలిసిన... నేషనల్ క్రైమ్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ శేఖర్...

హైదరాబాద్ జూన్ 13 వార్త వేదిక సూర్య :-
తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా బాధ్యతలు తీసుకున్న సివి ఆనంద్ డిజిపి ఐపీఎస్ అలాగే పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా డిజిపి ని కలిసి వారికి ప్రత్యేకమైన శుభాకాంక్షలు నేషనల్ క్రైమ్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ శేఖర్ తెలపడం జరిగింది. అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పలు అంశాలు డిజిపి దృష్టికి తీసుకురావడం జరిగింది. మరొకసారి కలిసి మరిన్ని విషయాలు చర్చించి తెలంగాణలో పోలీసులు నిర్వహిస్తున్న. వారు చేస్తున్న కార్యక్రమాలు తెలంగాణలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలపై త్వరలో నిర్ణయం తీసుకుని మరొకసారి కలిసి చర్చించుదామని తెలంగాణ డిజిపి సివి ఆనంద్ ఐపీఎస్ తెలపడం జరిగిందని. . అఖిల భారత జర్నలిస్టు ఫెడరేషన్ నెంబర్ దళిత జర్నలిస్టుల ఫోరం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నేషనల్ క్రైమ్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ శేఖర్ ప్రకటనలో తెలిపారు.



## ఎస్ఐఆర్ కార్యక్రమంలో మంద జగన్ సేవలు ప్రశంసనీయం

సికింద్రాబాద్, జూన్ 13(వార్త వేదిక సూర్య)
మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయిలో ఓటర్ ఐడీల పరిశీలన కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మంద జగన్ తన సేవా భావంతో ముందుండి ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవడం, సవరణలు చేయించుకోవడం, కొత్త ఓటర్లను నమోదు చేయించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం కృషి చేస్తున్నారు. బూత్ పరిధిలోని ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అవసరమైన మార్పులు చేయించేందుకు మార్గనిర్దేశనం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు ఉన్నా వెంటనే సరిచేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింత కింది మల్లేష్, పాక సాయి, బ్రహ్మచారి, భాస్కర్, రోహిత్, సందీప్, జీవన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వంలో సుశక్త భారత నిర్మాణం

**భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్ పోలాకి**

కూకట్ పల్లి, జూన్ 13 (వార్త వేదిక సూర్య) :



ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా భారతదేశం అభివృద్ధి, సుపరిపాలన, సంస్కరణల దిశగా వేగంగా ముందుకు సాగుతోందని భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్ పోలాకి పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, "సేవ, సుపరిపాలన, సంక్షేమం సంస్కరణలు" అనే లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి వర్గం ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయత్న్" అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ మోదీ ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం అనేక ప్రజాహిత పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.
గత 12 ఏళ్లలో దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక పురోగతి, జాతీయ భద్రత రంగాల్లో విశేషమైన మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన అన్నారు. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, డిజిటల్ సేవల విస్తరణతో దేశం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.
అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంచడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించారని కిషోర్ కుమార్ పోలాకి తెలిపారు. ప్రపంచ దేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేస్తూ, భారతదేశాన్ని ప్రపంచ వేదికపై శక్తివంతమైన దేశంగా నిలబెట్టారని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం మోదీ ప్రభుత్వ దూరదృష్టి, సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా, యూపీఐ, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. అలాగే, భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా పనిచేసిన జవహర్లల్ నెహ్రూ పదవీకాల రికార్డును అధిగమించి, అత్యధిక కాలం సేవలందించిన బీజేపీ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ కొత్త చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలియజేస్తూ, దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా అభివృద్ధి, సంక్షేమం, జాతీయ గౌరవాన్ని మరింత పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## వి.ఎస్. వర్మ జ్ఞాపకార్థం క్షత్రియ క్రీడోత్సవాలు ప్రారంభం

కూకట్ పల్లి, జూన్ 13 (వార్త వేదిక సూర్య) :
కూకట్‌పల్లి నియోజకవర్గంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో క్షత్రియ క్రీడోత్సవం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డి.వి.ఎస్. వర్మ జ్ఞాపకార్థ వాలీబాల్, టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లు ఘనంగా ప్రారంభమయ్యాయి. కెపిహెచ్‌బి కాలనీలోని అల్లూరి సీతారామరాజు స్పోర్ట్స్ గ్రౌండ్లో జరిగిన ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు క్షత్రియ క్రీడోత్సవం కమిటీ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. క్రీడలు కేవలం పోటీలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందించే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో పిల్లలు, యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, డిజిటల్ పరికరాలకే పరిమితమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు కూడా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతిరోజూ కనీసం ఒక గంట సమయాన్ని పిల్లల అభిరుచికి అనుగుణంగా ఏదైనా క్రీడలో పాల్గొనేలా చూడాలని కోరారు. దీంతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం పెరగడంతో పాటు శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం కూడా మెరుగుపడుతుందని వివరించారు. అంతేకాకుండా వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో ఏదో ఒక రకమైన వ్యాయామం లేదా క్రీడను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, క్రీడలు ఆరోగ్యకరమైన జీవనశైలికి బలమైన పునాది వేస్తాయని అన్నారు.

# ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా 100 అడుగుల రహదారి విస్తరణ

**ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం..**

**నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు**

**ఉషముల్లపూడి కమాన్**

**-గాజులరామారం మార్గంలో పనుల వేగం పెంచాలని అధికారులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆదేశం**

కూకట్ పల్లి, జూన్ 13 (వార్త వేదిక సూర్య) : శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉషముల్లపూడి కమాన్--గాజులరామారం ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వయా ఎల్లమ్మబండ మార్గంలో చేపట్టిన 100 అడుగుల రహదారి విస్తరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, ఆల్విన్ కాలనీ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, వివిధ శాఖల అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ఉషముల్లపూడి కమాన్ నుంచి గాజులరామారం వరకు ఎల్లమ్మబండ మార్గంలో ప్రతిరోజూ తీవ్రమైన ట్రాఫిక్ సమస్య నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 100 అడుగుల రహదారి విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. గతంలో తానే స్వయంగా అధికారులతో కలిసి ఉషముల్లపూడి కమాన్ నుంచి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర నిర్వహించి, రహదారి విస్తరణకు ఉన్న అడ్డంకులను గుర్తించి పరిష్కార మార్గాలను సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం పనులకు ఆటంకంగా ఉన్న సమస్యలను దశలవారీగా తొలగిస్తూ ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.



**అడ్డంకుల తొలగింపు -- యుద్ధప్రాతిపదికన పనులు**

రహదారి మధ్యలో ఉన్న భారీ బండరాళ్ల తొలగింపు, విద్యుత్ స్తంభాల స్థానభ్రంశం, చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని గాంధీ తెలిపారు. రహదారి విస్తరణ సమయంలో దెబ్బతిన్న మంచినీటి పైప్‌లైన్‌ను వెంటనే పునరుద్ధరించే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పనులు చేపడుతున్న సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

**అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ లేదు**

రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎక్కడా రాజీ పడకూడదని పీఏసీ చైర్మన్ స్పష్టం చేశారు. ప్రజల డబ్బుతో చేపడుతున్న అభివృద్ధి పనులు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా నిర్మించాలని అధికారులను ఆదేశించారు.
అదేవిధంగా రహదారి డివైడర్ల మధ్య సుందరీకరణ పనులు చేపట్టి, రహదారిని ఆధునికంగా తీర్చిదిద్దాలని సూచించారు. రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను వేగంగా తరలించి పనులకు ఆటంకాలు తొలగించాలని చెప్పారు.

**సమయం -- ఇంధనం ఆదా**

100 అడుగుల విస్తృత రహదారి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గడమే కాకుండా ప్రజల సమయం, ఇంధనం కూడా ఆదా అవుతుందని గాంధీ పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, వేగవంతమైన రవాణా వ్యవస్థ అందించడమే లక్ష్యమని చెప్పారు. “ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యాల కల్పన కోసం శాయశక్తులా కృషి చేస్తాను. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తాను” అని ఆయన హామీ ఇచ్చారు.

**శేరిలింగంపల్లి అభివృద్ధే లక్ష్యం**

శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల కల్పనలో తనవంతు బాధ్యత నిర్వర్తిస్తానని ఆరెకపూడి గాంధీ పునరుద్ఘాటించారు.
ఈ పరిశీలన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**ఉషముల్లపూడి కమాన్--గాజులరామారం మార్గంలో 100 అడుగుల రహదారి విస్తరణ**

ఎల్లమ్మబండలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లక్ష్యం, విద్యుత్ స్తంభాల స్థానభ్రంశం, బండరాళ్ల తొలగింపు వేగవంతం చేయాలని అన్నారు.
దెబ్బతిన్న మంచినీటి పైప్‌లైన్ పునరుద్ధరణ
నాణ్యతలో రాజీ లేకుండా యుద్ధప్రాతిపదికన పనులు
సమయం, ఇంధనం ఆదా చేసే ఆధునిక రహదారి నిర్మాణం చేపట్టాలని, శేరిలింగంపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు.






## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ బ్యూరో, జూన్ 13 (వార్తా వేదిక సూర్య ) కేతపల్లి మండలం గుడివాడ గ్రామంలో నిర్వహించిన నల్గొండ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం అనీ ,యువత ప్రతిభను వెలికితీయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అనంతరం టోర్నమెంట్ లో పాల్గొంటున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసి, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

## అనంతుల రాములు మృతి చాల బాధాకరం కేతావత్ భిల్యా నాయక్

దేవరకొండ జూన్ 13 (వార్త వేదిక సూర్య ):- చింతపల్లి మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన అనంతుల రాములు మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ దేవరకొండ ప్రభుత్వం ఆసుపత్రిలో అనంతుల రాములు పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి నివాళులు అర్పించిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో చింతపల్లి మాజీ జడ్పీటీసీ హరి నాయక్,గొల్లపల్లి సర్పంచ్ శ్రీను, ప్రశాంత పూరి తండా సర్పంచ్ కేతావత్ శ్రీను నాయక్, జంగయ్య, రాములు,మహేష్,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

## తీవ్ర విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలకు నేనావత్ కిషన్ నాయక్ ఆర్థిక సహాయం మరియు భరోసా

దేవరకొండ జూన్ 13 ( వార్త వేదిక సూర్య ):-



దేవరకొండ మండలంలోని జర్పుల తండ గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు బావిలో పడి మరణించిన సంఘటన తీవ్ర కలచివేసింది. గ్రామానికి చెందిన జర్పుల శివ నాయక్ కుమారుడు జర్పుల రిత్విక్ అలాగే జర్పుల చంటి కుమారుడు హర్షవర్ధన్ అకాల మరణం చెందారనే విషయం తెలుసుకున్న బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.
ఈ రోజు ఉదయం బాధిత చిన్నారుల స్వగృహాలకు వెళ్ళిన కిషన్ నాయక్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. పుత్రశోకంతో ఉన్న ఆ తల్లిదండ్రులను ఓదార్చి, వారికి ధైర్యాన్ని మరియు భరోసాను కల్పించారు. అనంతరం బాధిత రెండు కుటుంబాలకు తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు
బాధిత కుటుంబాల పరామర్శలో కిషన్ నాయక్ గారి వెంట సర్పంచ్ గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ జైహిందూ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవీందర్,మాజీ సర్పంచ్ ఇద్దయ్య,జర్పుల వాగ్య, సత్తి రెడ్డి, అల్వాల్ రెడ్డి, నేనావత్ రమేష్ నాయక్, ఆంగోత్ సంతోష్, నరసింహ, రవి, ఖాజా, రమేష్ మరియు స్థానిక యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## కొండమల్లేపల్లి పట్టణం ప్రతి వార్డులో అండర్ డ్రైనేజ్ లు నిర్మిస్తాం

**కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగేందర్ రెడ్డి**

దేవరకొండ జూన్ 13 (వార్త వేదిక సూర్య):-
కొండమల్లేపల్లి పట్టణం వాసవి బజార్ (9వ వార్డు)లో మురికి నీరు ఓపెన్ డ్రైనేజీ లో వెళ్లడంతో పక్కన ఉన్న ఇండ్లకు దుర్వాసన, దోమలు వచ్చి ప్రజలు అనారోగ్యానికి గురి కావడం జరిగేది. ఈ విషయం సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే అండర్ డ్రైనేజ్ పనులు ప్రారంభించడం జరిగింది. ప్రారంభించిన డ్రైనేజీ పనులు పూర్తి కాగా రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా నిర్మించిన అండర్ డ్రైనేజీ పై మట్టిని నింపి, రోడ్డు మార్గం ఇబ్బంది కలగకుండా చేస్తున్నారు

## జిల్లాలో కనిపించని ఫుడ్ సేఫ్టీ అధికారులు

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న హోటల్ బేకరీల యజమానులు...**

నాగర్ కర్నూలు జిల్లా, జూన్ 13 (వార్తా వేదిక సూర్య):





నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారా లేదా అనే అనుమానాలు. ఉంటే తనిఖీలు ఎక్కడ. వేసవికాలంలో చల్లని పానీయాలు ఐస్ క్రీమ్ కూల్డ్రింక్స్ వంటివి ఎన్నో ప్రయాభిప్రాయాలు జరిగాయి ఎంతో మంది అనారోగ్యం పాలై హాస్పిటల్ పాలయ్యారు. తనిఖీలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు అని దీనికి నిదర్శనం నిలువెత్తు. తనిఖీ చేయవలసిన అధికారులు ఉన్నారా ఉంటే ఎక్కడ. కనీసం నాగర్కర్నూల్ జిల్లా ఉందా ఉంటే అక్కడ ప్రజల పరిస్థితి ఏంటి అని ఆలోచన ఉందా. అడపదడపా తనిఖీలు చేయడం. చేతులు దులుపుకోవడం కామన్ అయిపోయింది. ఏది ఏమైనా ప్రజల ఆరోగ్యం చూసుకోవలసిన బాధ్యత అసలు జిల్లాలో తనిఖీలు చేయకుండా అసలు హోటల్ బేకరీలు తినుబండారాలు చల్లని పానీయాలు తదితర వండి వే కాకుండా ఐస్ క్రీమ్ పార్లర్. తనిఖీ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు ఫుడ్ సేఫ్టీ అధికారులు. మరి మనకెందుకులే అని ఉన్నారా లేదా మామూలు తీసుకుంటున్నారా అని ప్రజలు అంటున్నారు. కనీసం ఉంటే సేఫ్టీ ఆఫీసర్స్ జాడ తెలియని జిల్లా ప్రజలు. ఇదొక ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉంటారా ఉంటే ఎక్కడ ఉంటారు ఇప్పటివరకు ఎక్కడ తనిఖీ నిర్వహించారు అని ప్రజలు వాపోతున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతం స్కూలు ప్రారంభం కాబోతున్న సందర్భంగా కల్తీహారం కల్తీ చాక్లెట్ బిస్కెట్స్ బేకరీ వాటర్ కూల్డ్రింక్స్ కేక్స్ వంటి వాటిపై ప్రత్యేకమైన నిగా పెట్టి ప్రజల ఆరోగ్యం కాపాడవలసిన బాధ్యత ఎంతైనా ఫుడ్ సేఫ్టీ అధికారులపై ఉంది మరి ఇప్పటివరకు ఈ అధికారులు కనిపించకపోవడంతో మరి పేపర్ ప్రకటన వెయ్యాలా అని ప్రజలు అంటున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే మరియు జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి స్పందించి వెంటనే వారి కర్తవ్యం లో భాగంగా మరి తనిఖీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చట్టపరంగా ముందుకు వెళ్లి ప్రజల ప్రాణాలకు హాని కలిగించే వాటిపై చర్య తీసుకోకందున ఆర్టికల్ ప్రకారం వారిపై చర్య తీసుకుని వారి ఉద్యోగం నుంచి తొలగించి ప్రజల ఆరోగ్యం కాపాడే మంచి ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించాలని నాగర్ కర్నూలు జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## పలు సమస్యలపై ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, మాజీ కార్పొరేటర్ జగన్ పర్యటన

**త్రాగునీరు, డ్రైనేజీ, చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**

కుత్బుల్లాపూర్, జూన్ 13 (వార్త వేదిక సూర్య) కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) సదాయంలో నెలకొన్న పలు సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శనివారం కాలనీలో పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ధర్మారపు అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, కాలనీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ప్రధానంగా త్రాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, అలాగే జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల షాపుల తొలగింపు, సంక్షేమ సంఘం భవన నిర్మాణం,రోడ్లు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు.
అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. త్రాగునీటి



కొరత, డ్రైనేజీ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి కాలనీ ప్రజలకు ఉపశమనం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. చిరు వ్యాపారుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే, ఉపాధి కోసం చిన్న చిన్న షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వారి జీవనోపాధి దెబ్బతినకుండా పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్రాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని, అలాగే చిరు వ్యాపారుల సమస్యను సానుకూలంగా పరిశీలించి వారికి ఇబ్బందులు కలగకుండా చూడటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య అనుగుణంగా పాఠశాలల సంఖ్యను పెంచాలి

**పూర్వ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**

**విద్యార్థుల అవసరం మేరకే టీచర్ల సర్దుబాటు చేయాలి**

**పి ఆర్ సి ప్రకటించాలి - హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలి**

**టి.ఎస్.యు.టి.ఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ**

నల్లగొండ బ్యూరో, జూన్ 13 (వార్తా వేదిక సూర్య ) యుటిఎఫ్ భవన్ లో టీఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బక్కా శ్రీనివాసా చారి అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన పూర్వ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. యుటిఎఫ్ కార్యకర్తలు ప్రభుత్వ బడులలో విద్యార్థుల నమోదు పెంచడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేడు పాలనలో, ప్రతిపక్షంలో ఉన్న మూడు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రభుత్వ బడుల మూత పై నోరు మెదపడం లేదని ఆరోపించారు. పారిశ్రామీకరణ పట్టణీకరణ మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువ దంపతుల వలసల తో నగరాలలో పెరిగిన జనాభాకు అనుగుణంగా నేడు ప్రభుత్వ బడులు లేవని, జనాభా పెరుగుదలకు అనుగుణంగా నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్, చండూరు లాంటి పట్టణ ప్రాంతాలలో ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ బడులు ఏర్పాటు చేయాలని వారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు.
నల్లగొండ పట్టణంలో 44 వేల మంది విద్యార్థులు చదువుతుండగా అందులో కేవలం ఒక 5,000 మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని, నల్లగొండ పట్టణంలో బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసిన విధంగానే కేశరాజు పల్లి, రామగిరి, జేబీఎస్, అక్కలాయి గూడెం పాఠశాల అభివృద్ధి చేస్తే పట్టణ ప్రాంతంలో ఆర్థికంగా వెనకబడిన ఎంతో మందికి, మధ్య తరగతి వర్గానికి సౌకర్యంగా ఉంటుందని అందుకు స్థానిక మంత్రి చొరవ చూపాలని కోరారు.
తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నల్లగొండ జిల్లా కమిటీ అక్రమ డిప్యూటేషన్ పెద్ద కోసం ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంటుందని. అవసరమైతే తాను అక్రమ డిప్యుటేషన్ల రద్దుకై




ప్రజలను కూడా సమీకరిస్తానని అన్నారు. ఈ సమావేశంలో మరో అతిథి టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం రాజశేఖర్ రెడ్డి గారు మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలని, ప్రభుత్వం వాగ్దానం చేసిన విధంగా షూస్ లతో కూడిన కిట్టును అందించాలని, నల్లగొండ జిల్లాలో మంజూరైనటువంటి 124 ప్రీ ప్రైమరీ సెక్షన్లకు అవసరమైన ఇన్స్ట్రక్టర్ మరియు ఆయా పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ ద్వారా నింపాలని, ప్రభుత్వం హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విధివిధానాలను రూపొందించి తక్షణమే అమలు పరచాలని, పిఆర్సి నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు జులైలో నెలలో ప్రమోషన్లు బదిలీల ప్రక్రియ చేపట్టాలని, రెగ్యులర్ ఎంఈఓ, డిప్యూటీ డివో, డివోలను నియమించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి జి నాగమణి, ఎడ్ల సైదులు జిల్లా ఉపాధ్యక్షులు నర్రా శేఖర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జి అరుణ, జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, నలపరాజు వెంకన్న, భాను ఆడిట్ కమిటీ సభ్యులు భాను ప్రకాష్, మధుసూదన్ వివిధ కమిటీల కన్వీనర్లు పగిడిపాటి నరసింహ, ప్రభాకర్, బి.సురేందర్ రెడ్డి, ఎరనాగుల సైదులు, శ్యాం కుమార్, శ్రీలత, వరలక్ష్మి, రాగి రాకేష్ మరియు వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

# భీమలింగం కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలి

**- సీపీఎం డిమాండ్**

**వలిగొండ: జూన్ 13 (వార్తా వేదిక సూర్య )** వలిగొండ నుండి తుర్కపల్లి మీదుగా పాలడుగు వరకు ప్రవహించే భీమలింగం కాల్వలో విపరీతంగా పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకు,చెత్తాచెదారాన్ని వెంటనే అధికారులు స్పందించి తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్,మెరుగు వెంకటేశం లు డిమాండ్ చేశారు. శనివారం రోజున సీపీఎం వలిగొండ మండల,పట్టణ కమిటీల ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు కాల్వ ప్రవహించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా కాల్వ అంతా గుర్రపుడెక్క మొక్కలతో నిండిపోయి, నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం కలిగిస్తున్న దుస్థితిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమ లింగం కాల్వలో పేరు కుపోయిన గుర్రపు డెక్క ఆకు వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి అన్నారు. కాల్వ పొడవునా గుర్రపుడెక్క ఆకు దట్టంగా పేరుకుపోవడం వల్ల సాగునీరు ముందుకు సాగకుండా నిలిచిపోతోంది. దీనివల్ల రైతులకు సకాలంలో నీరందక తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని వెంటనే అధికారులు స్పందించి గుర్రపు డెక్క ఆకును తొలగించాలని డిమాండ్ చేశారు. మరోవైపున వలిగొండ పట్టణంలో ఈ గుర్రపు డెక్క ఆకుతో నీరు కలుషితమవుతుండడం వల్ల , దోమల వ్యాప్తి చెందుతాయని ప్రస్తుతం వర్షాకాల సీజన్ రావడంతో ప్రజలకు విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక యంత్రాంగం యుద్ధప్రాతిపదికన స్పందించి జెసిబి యంత్రాల ద్వారా కాల్వను శుభ్రం చేయించాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దుబ్బ లింగం, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,మండల, పట్టణ



నాయకులు, కొండూరు సత్తయ్య, రాధారపు మల్లేశం,శీలం ఇందిర, వేముల లక్ష్మయ్య, ద్యాన బోయిన యాదగిరి,అలకుంట్ల నరసింహ,బొడ్డు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ముత్తిరెడ్డిగూడెంలో మండల ఉద్యమకారుల ఫోరం ఏర్పాటు

**▶▶ అధ్యక్షుడిగా నిమ్మ శేఖర్ రెడ్డి నియామకం**

**మోటకొండూరు, జూన్ 13 (వార్త వేధిక సూర్య):-** ఊరు చిన్నది -- ఉద్యమం పెద్దది" అని పేరుగాంచిన మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం ఉద్యమ గడ్డపై తెలంగాణ మలిదశ ఉద్యమకారుల మండల ఫోరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల ఫోరం నూతన అధ్యక్షుడిగా నిమ్మ శేఖర్ రెడ్డి నియామకమయ్యారు.తెలంగాణ మలిదశ ఉద్యమకారుల రాష్ట్ర ఫోరం అధ్యక్షులు పూస శ్రీను అధ్యక్షతన ఈ నియామక కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పూస శ్రీను మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులందరికీ తప్పకుండా న్యాయం జరిగేలా ఫోరం కృషి చేస్తుందని, వారి హక్కుల సాధనకై నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫోరం కోశాధికారి బుడిగె ఐలయ్య, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు మరియు మలిదశ ఉ





ద్యమకారులు జోరుక ఎల్లేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మరియు ఉద్యమకారులు చాడ శశిధర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆడెపు శ్రీను తదితర ప్రముఖ ఉద్యమకారులు పాల్గొన్నారు.

**ఉద్యమ నేత పసునూరి నరసింహులు పరామర్శ ....**

తెలంగాణ సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ముత్తిరెడ్డిగూడెం నాటి రాజకీయ జేఏసీ చైర్మన్ పసునూరి నరసింహులు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫోరం నాయకులు మరియు స్థానిక ఉద్యమకారులు ఆయన నివాసానికి వెళ్లి, నరసింహులు ని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు.




# డబల్ బెడ్ రూమ్ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

**- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**( యాదాద్రి భువనగిరి బ్యూరో ) జూన్ 13 వార్తా వేదిక సూర్య :** సింగన్నగూడెం 2దీఎఖ పెండింగ్ పనులను పరిశీలించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు .భువనగిరి సింగన్నగూడెం 2దీఎఖ కాలనీలో కొనసాగుతున్న పెండింగ్ పనులను భువనగిరి ఎమ్మెల్యే గారు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపట్టాల్సిన మౌలిక వసతుల పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, అంతర్గత రహదారులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా సంబంధిత అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్ ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తాటి చెట్టు కూలి మహిళ మృతి



**మహేశ్వరం జూన్ 13 వార్త వేదిక సూర్య:**బలమైన ఈదురుగాళ్లకు తాడి చెట్టు కూలి ఓ ఇంటిపై పడడంతో ఆ ఇంటిలో నిద్రిస్తున్న మహిళ పై పడడంతో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో భారీ ఈదురుగాలులకు తాటి చెట్టు కూలిపడి మహిళ మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. సభావత్ లక్ష్మి,తన కుమారుడు వెంకట్ రామ్, కోడలు లలితతో కలిసి లలితా నగర్ లోని రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఓ రేకుల ఇంట్లో అద్దెకు నివాసం ఉంటున్నారు. వీరంతా వికలాంగులేనని స్థానికులు తెలిపారు. శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో బలమైన ఈదురుగాలులు వీచడంతో ఇంటి పక్కనే ఉన్న తాటి చెట్టు ఒక్కసారిగా కూలి, ఇంట్లో నిద్రిస్తున్న సబావత్ లక్ష్మి (75)కుటుంబ సభ్యులపై పడింది.ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన సభావత్ లక్ష్మిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు, కుమారుడు వెంకట్ రామ్, కోడలు లలిత స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చెట్టు కూలి గోడపై పడి మధ్యలో విరిగింది. మధ్యలో ఇరగకపోతే మహిళ మృతి చెందేది కాదని, ఆమె కుటుంబ సభ్యులకు ఎటువంటి గాయాలు కాకపోయేది సురక్షితంగా బయటపడేవారని స్థానికులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# బాల కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు

**ఆలేరు నియోజవర్గం వార్త వేదిక సూర్య :-** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశానుసారం, ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ గంగాపురం మల్లేష్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ గంగాపురం మల్లేష్ మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలైన 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలతో ఎలాంటి పనులు చేయించకూడదని, అది బాలకార్మిక నిరోధక చట్టం ప్రకారం పక్కా నేరమని స్పష్టం చేశారు. ఇళ్లలో, వ్యాపార దుకాణాలలో, మెకానిక్ షెడ్లలో లేదా కఠినమైన వ్యవసాయ పనుల్లో పిల్లలను కార్మికులుగా చేర్చుకుంటే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పిల్లలందరినీ బడికి పంపించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు.అనంతరం పారా లీగల్ వాలంటీర్ కానుగంటి శ్రీశైలం మాట్లాడుతూ.. న్యాయం దృష్టిలో పేద, ధనిక అనే తేడాలు లేకుండా అందరూ సమానులేనని, భారత రాజ్యాంగం అందరికీ సమాన న్యాయ అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. కోర్టుల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను ఇరుపక్షాల వారు పరస్పర అంగీకారంతో 'లోక్ అదాలత్' ద్వారా త్వరితగతిన, ఉచితంగా పరిష్కరించుకోవచ్చుని సూచించారు.ఈ అవగాహన సదస్సులో ఏఎన్ఎం మమత, ఆశా కార్యకర్తలు భాగ్యమ్మ, రజిత, పద్మ, షాహిని, అనూష తదితర వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సిరి క్రషర్ ఏర్పాటు నిలిపివేయాలి

**▶▶ క్రషర్ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు ▶▶ సిరిపురం గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి**

**రామన్నపేట,జూన్ 13 (వార్త వేదిక సూర్య )** రామన్నపేట మండల పరిధిలోని సిరిపురం



గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన సిరి మెటల్ స్టోన్ క్రషర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని సిరిపురం గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం క్రషర్ ఎదురుగా ఏర్పాటుచేసిన అఖిలపక్ష కమిటీ మరియు బాధిత రైతు పోరాట కమిటీ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్రషర్ నిలిపివేయాలని కోరుతూ 70 మంది రైతులు సంతకాల సేకరణ ద్వారా తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. గ్రామపంచాయతీ ద్వారా ఎటువంటి అనుమతులు క్రషర్కు ఇవ్వలేదని అన్నారు. గ్రామం లో క్రషర్ టిప్పర్ల ద్వారా నిత్యం ప్రాణ సంకటంగా మారిందని అన్నారు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్రషర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగిన సహించబోమని హెచ్చరించారు. ఎటువంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారని ఆరోపించారు క్రషర్ ఏర్పాటులో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఎం. అనూష రమేష్, అఖిలపక్ష నాయకులు ఏళ్ల సంజీవరెడ్డి, కందుల మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం, బడుగు రమేష్, పోరాట సమితి నాయకులు కూ నురు రమేష్, గాదె శంకరయ్య, గుంటూరు కృష్ణమాచారి,సంగిశెట్టి మహేష్ , బల్గూరి ఉపేందర్, దయ్యాల శ్రీశైలం, కందుల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం
జూన్ 14, 2026
సంపుటి : 2, సంచిక : 25
Follow:




# యాదాద్రి కొండ పైన భక్తుల రద్దీ

- స్వామివారి నిత్య రాబడి రూ.45.30 లక్షలు

**యాదగిరిగుట్ట జూన్ 13 (వార్త వేదిక సూర్య) :** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సెలవు దినాలు కావడంతో కొండపైన భక్తులతో కిటకిటలాడింది. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీ కారణంగా కొండ కింద లక్ష్మీ పుష్కరిణి, అన్నదాన సత్రం, కళ్యాణ కట్ట, సత్యనారాయణ వ్రత మండపం, పార్కింగ్ ఏరియా, కొండపైన బస్ స్టేషన్, ప్రసాద క్యూలైన్లు, భక్తులతో నిండిపోయాయి. భక్తుల రద్దీ కారణంగా స్వామివారి ధర్మదర్శనానికి





రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట టైం పడుతుంది అని భక్తులు అన్నారు . ఆలయంలో జరిగే సుదర్శన నారసింహ హోమం, సువర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం, వేద ఆశీర్వచనం, సాయంత్రం స్వామివారి వెండి జోడు, మ్రొక్కు సేవలో పాల్గొని, స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అనుబంధాలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారి ఆలయ నిత్య రాబడిలో భాగంగా శనివారం రోజున రూ. 45,30,856,ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాకేష్ కుమార్ చార్యులు, నరేష్ కుమార్ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కొండోజు శేఖర్ కుటుంబానికి అండగా ఉంటాం

**- తెలంగాణ విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్**

**హైదరాబాద్, జూన్ 13, వార్తా వేదిక సూర్య :** ఇటీవల కిడ్నీలో రాయి సమస్యతో తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందిన విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు కొండోజు శేఖర్ను తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తూములూరి సత్యనారాయణ చారి మాట్లాడుతూ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కొండోజు శేఖర్ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని తిరిగి తన వృత్తి బాధ్యతలను నిర్వహించాలని ఆకాంక్షించారు.విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల సంక్షేమమే సంఘం ప్రధాన లక్ష్యమని, సభ్యులకు ఏ ఆపద వచ్చినా తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ అండగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. సంఘ సభ్యుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.కొండోజు శేఖర్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని నాయకులు, సభ్యులు ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సంఘానికి చెందిన పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులకు సన్మానం



**వలిగొండ, జూన్ 13 (వార్తా వేదిక సూర్య) :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, వలిగొండ టౌన్ అధ్యక్షులు గా పోలేపాక జానకి రాములు నూతనంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వలిగొండ మండల ప్రధాన కార్యదర్శి లోడే శ్రీకాంత్, మండల సీనియర్ నాయకులు బర్మా జంగయ్య, ఉంగురాల సోమయ్య,గ్రామశాఖ ఉపాధ్యక్షులు ఏనుగు జంగారెడ్డి,గ్రామశాఖ కార్యదర్శి చిన్నం రాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు దయ్యాల బాల వికాస్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి




**రామన్నపేట,జూన్ 13 (వార్త వేదిక సూర్య)** ఎమ్మెల్యే వేములవీరేశం చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం మండల కేంద్రంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు మంచి వరం లాంటిదని, పేదలకు ఊరట ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి కే యం జాన్, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, నాయకులు జేల్లా వెంకటేష్, గొరిగే శేఖర్, వినాయతుల్లా బిగ్, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# ఈదురు గాలులకు కూలిన వైఎస్ఆర్ విగ్రహం

- స్పందించిన ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి
- కింద పడిపోయిన వైఎస్ఆర్ విగ్రహాన్ని భద్రపరచాలని స్థానిక సర్పంచ్ మునగపాటి నవీన్ కి తెలియజేసిన ఎమ్మెల్యే
- ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం పై స్థానిక ప్రజలు ఆగ్రహం

**మహేశ్వరం జూన్ 13 వార్త వేదిక సూర్య**

మహేశ్వరం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి,విగ్రహం ఇటీవల వీచిన బలమైన ఈదురుగాలుల కారణంగా కూలిపోయింది. అయితే విగ్రహం కూలి మూడు రోజులు గడిచినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, సుమంగళ కన్వెన్షన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్తుండగా అంబేద్కర్ చౌరస్తాలో వైఎస్సార్ విగ్రహం కనిపించకపోవడంతో స్థానికులను అడిగి విషయం తెలుసుకున్నారు. అనంతరం అక్కడే కిందపడిపోయి ఉన్న విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే, విగ్రహాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భద్రపరచాలని సూచించారు. అలాగే విగ్రహం పునఃస్థాపనకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించినట్లు సమాచారం. మహేశ్వరం ప్రధాన రహదారిపై, నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజలు రాకపోకలు సాగించే అత్యంత రద్దీ ప్రాంతంలోనే విగ్రహం కూలిపోవడం చర్చనీయాంశంగా మారింది. మూడు రోజులుగా విగ్రహం నేలపై పడివున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పటికీ విగ్రహం కూలిన విషయాన్ని గుర్తించకపోవడం లేదా పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశాల్లో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విగ్రహాన్ని త్వరితగతిన పునఃస్థాపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వైఎస్సార్ అభిమానులు సైతం ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేస్తూ, విగ్రహం కూలిన వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉండగా మూడు రోజుల పాటు నిర్లక్ష్యం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



# విశ్వబ్రాహ్మణ జాతి ఐక్యతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కాసోజు శంకరమ్మను కోరిన విశ్వబ్రాహ్మణ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తూములూరి సత్యనారాయణ చారి**

**(యాదాద్రి భువనగిరి బ్యూరో), జూన్ 13: వార్త వేదిక సూర్య :** విశ్వబ్రాహ్మణ జాతి ఐక్యత కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలం గాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు తూములూరి సత్యనారాయణ చారి పిలుపుని చ్చారు. తెలంగా ణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా బాధ్యత లు చేపట్టిన శ్రీమతి కాసోజు శంకరమ్మను సంఘం ప్రతినిధులతో కలిసి మర్యాదపూర్వకం గా కలిసిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా కాసోజు శంకర మ్మకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనం గా సత్కరించారు. అనంతరం తూములూరి సత్య నారాయణ చారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సమాజం అభివృద్ధి చెందాలంటే జాతి బిడ్డలంతా ఐక్యంగా ఉండాలని, సమాజ ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని కోరారు. విశ్వబ్రా హ్మ ణుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిర క్షణ, సామాజిక అభ్యున్నతి కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నా రు. కాసోజు శంకరమ్మ మాట్లాడుతూ మహిళా కమిషన్ సభ్యురాలిగా మహిళల హక్కుల పరిర క్షణ, సాధికారత, సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మహిళలు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమంలో



మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండోజు శ్రీనివాస్, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి మండలోజు వరప్రసాద్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష నరసింహచారి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తల్లోజు బ్రహ్మయ్య చారి,సంఘం నాయకులు నెమలికొండ గోవిందాచారి,దాట్ల కృష్ణమూర్తి, వెంకటాచారి, సంతోష్ కుమార్, సంజయ్ చారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నూతన అధ్యక్షుని ఘనంగా సన్మానించిన ఉద్యమకారుల పోరం నాయకులు

**వలిగొండ: జూన్ 13 (వార్తావేదిక సూర్య)** వలిగొండ మండల కాంగ్రెస్ పార్టి నూతన అధ్యక్షునిగా ఇటీవల నియమితులైన బత్తిని సహదేవ్ గౌడ్ ను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కమిటీని వేయడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉద్యమకారుల ఫోరం నాయకుడు బత్తిని సహదేవ గౌడ్ ను అధ్యక్షునిగా నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు సహదేవ్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీని మాట తప్పకుండా నెరవేరుస్తుందని, తనను సన్మానించిన ఉద్యమకారుల ఫోరం నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజయ్య, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, ఫోరం గౌరవ అధ్యక్షుడుకళ్లెం లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంధ మల్ల బాలయ్య, ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు గంధ మల్ల మల్లమ్మ, చిలుగూరిసత్తిరెడ్డి, బత్తిని రవీందర్, మల్లం వెంకటేశం,బొడిగేసుదర్శన్, కదిరేని స్వామి,కొండూరు సత్తయ్య,దండ మల్లికార్జున్, సుంకి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.









Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**